# హైదరాబాద్‌లో భారీ డేటా సెంటర్

## రూ.1,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న కంట్రోల్‌ఎస్

న్యూఢిల్లీ: హైదరాబాద్ ఐటి హబ్‌లో కంట్రోల్‌ఎస్ సంస్థ భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. "హైదరాబాద్‌లో 100 మెగాబైట్ కెపాసిటీతో (టైర్ 4 కేటగిరీలో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి సమానమైన) హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే 3-6 నెలల్లో పనులు ప్రారంభించనున్నాం. పూర్తి కావడానికి 18 నెలలు పడుతుంది. ఈ డేటా సెంటర్ కోసం రూ.1,200 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నాం" అని కంట్రోల్‌ఎస్ సిఇఒ శ్రీధర్ పిన్నపు రెడ్డి వెల్లడించారు. అంతేకాదు, ఈ సంస్థ హైదరాబాద్, ముంబైలో మరో రెండు చిన్నపాటి డేటా సెంటర్లను కూడా ఏర్పాటు చేయబోతోంది. "ముంబైలో లక్షా 30వేల చదరపు అడుగులు, హైదరాబాద్‌లో 70-80వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో డేటా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఈ రెండు సెంటర్లు డిసెంబర్ నాటికి పూర్తికావచ్చు. ఇందుకోసం మరో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాం" అని శ్రీధర్ చెప్పారు. సంస్థ మొత్తంగా రూ.1,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పెట్టుబడుల కోసం అంతర్గత వనరుల వినియోగంతోపాటు కొంత మొత్తంలో రుణాలు కూడా సేకరించనున్నట్లు శ్రీధర్ వెల్లడించారు. టైర్-4 కేటగిరీ డేటా స్టోరేజ్ సెంటర్ల నిర్వహణలో ఆసియాలోనే తాము అగ్రగామి అని కంట్రోల్‌ఎస్ అంటోంది. ప్రస్తుతం ఈ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), టాటా గ్రూపు, మహీంద్రా గ్రూపు కంపెనీలు, అదానీ గ్రూపు, బిర్లా గ్రూపు కంపెనీలు, ఫెడెక్స్‌తో పాటు పలు ప్రముఖ కంపెనీలకు డేటా స్టోరేజీ సేవలందిస్తోంది.




### ఈ ఏడాది రూ.800 కోట్ల ఆదాయం

ప్రస్తుతఆర్థిక సంవత్సరంలో కంట్రోల్‌ఎస్ స్థూల ఆదాయం రూ.500 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు శ్రీధర్ చెప్పారు. తాము క్లౌడ్4సి పేరుతో 20కిపైగా దేశాల్లో క్లౌడ్ సేవలు అందిస్తున్నట్లు, ఈ వ్యాపార ఆదాయం కూడా కలిపితే మొత్తం రూ.800 కోట్లుగా నమోదుకావచ్చన్నారు.

Scanned by CamScanner